అందుబాటులో ఉండి..సమస్యలు పరిష్కరిస్తా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జనవరి 6 : ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. పేదల సమస్యల పరిష్కార కేంద్రంగా సీతాఫల్‌మండిలోని కార్యాలయం కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో మాదిరిగానే కార్యాలయానికి వచ్చే వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానని అన్నారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ మున్సిపల్ డివిజన్లకు సంబంధించిన 27 మంది లబ్ధిదారులకు రూ. 27 లక్షల విలువగల కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పరిపాలనలో పదేండ్ల కాలంలో సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేవిధంగా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్, అధికారులు, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ,ప్రసన్న లక్ష్మి,బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, కిరణ్‌గౌడ్,మల్లూరి అనిల్, వంజరి సతీశ్, బెజ్జంకి రాజేశ్ పాల్గొన్నారు.

చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

రిసాలబజార్‌లో ఉచిత వైద్య శిబిరం

కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం రిసాల బజార్‌లో టీం సాయి ఫౌండేషన్ (కిమ్స్,సన్‌షైన్ ఆస్పత్రి) ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ మేరకు శిబిరంలో జనరల్ ,చిన్న పిల్లలు,ఆర్థో,గైనిక్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు మెఘా, ఎండీ.జాహెద్, సందీప్,ఎన్.ఎస్ కిరణ్ కుమార్,జైనపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. - బొల్లారం, జనవరి 6

రగ్గులు.. నోట్ పుస్తకాలు పంపిణీ

బల్కంపేటలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు రగ్గులు పంపిణీ చేశారు. హాస్టల్‌లో ఉంటున్న బాలికలు చలికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎస్.ఆర్.నగర్ వయోధికుల మండలి అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో శనివారం దాదాపు 100 మంది బాలికలకు రగ్గులతో పాటు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలి ప్రతినిధులు పి.లింగమయ్య, నారాయణరెడ్డి, ఎస్.మాధవరావు, ఎ.బిచ్చప్ప, పి.పండరయ్య, మాణిక్‌రావు, సుందర్ నాయి, ఎ.అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు. - అమీర్‌పేట్, జనవరి 6

బాలానంద సంఘంలో డ్రాయింగ్ పోటీలు

కాచిగూడ, జనవరి 6 : తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చిత్ర కళాకారిణి మహాలక్ష్మి సూచించారు. ఆంధ్ర బాలానంద సంఘం అధ్యక్షురాలు జె.వి.కామేశ్వరి ఆధ్వర్యంలో బాలానంద సంఘంలో బాల బాలికలకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. తెలంగాణ విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఉందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వర్ణబాల, సరసి, రాంబాబు, లావణ్య పాల్గొన్నారు.

ఐడీహెచ్ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం

బోయిగూడలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజు

బన్సీలాల్‌పేట్, జనవరి 6 : న్యూ బోయిగూడలోని ఐడీహెచ్ కాలనీలోని 10వ నంబర్ బ్లాక్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రూ.7 లక్షలను మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ పూర్తి కావడంతో జలమండలి ఆధ్వర్యంలో శనివారం పనులు మొదలుపెట్టారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ రాజు, ఐడీహెచ్ కాలనీ అధక్షుడు ఎ.శ్రీనివాస్ ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే తలసానికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, అంగన్‌వాడీ టీచర్ మంజులత పాల్గొన్నారు.

ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన సాయిశ్రీగౌడ్‌ను సికింద్రాబాద్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం అంబర్‌పేటలోని ఆమె కార్యాలయంలో నాయకులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్‌రెడ్డి, పోచయ్య యాదవ్, నగరపు శ్యాం పాల్గొన్నారు. - సికింద్రాబాద్, జనవరి 6

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అందాలి

పరికిబస్తీ కమ్యూనిటీహాల్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత

వారాసిగూడలోని బీదలబస్తీ గ్రౌండ్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మారేడ్‌పల్లి/బేగంపేట్, జనవరి 6: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. లాస్యనందిత అన్నారు. శనివారం మోండా డివిజన్ పరిధిలోని పరికి బస్తీలోని డొక్కాలమ్మ ఆలయం సమీపంలోని కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీల దరఖాస్తులకు ఆఖరి రోజు కావడంతో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి అర్హులకు న్యాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నివేదిత, దాసరి కర్ణకుమార్, అజేయ్, సాయి ప్రసాద్, గోపాల్, భవాని, అనిత పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

ఆరు గ్యారెంటీల అమలు కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. బేగంపేట్ సర్కిల్ పరిధిలో గత నెల 28న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6 వరకు కొనసాగింది. బేగంపేట్ సర్కిల్ పరిధిలో అధికారులు వివిధ డివిజన్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం విధులు నిర్వహించారని, హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపాలన సెంటర్లలో ప్రధానంగా గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని సర్కిల్ డీసీ శంకరయ్య తెలిపారు.

'నాగార్జున యూనివర్సిటీ వీసీని తొలగించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 6 : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభకు అనుమతి ఇవ్వకపోవడమంటే రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాయడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మండిపడ్డారు. నాగార్జున యూనివర్సిటీ వీసీ రాజశేఖర్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. సభకు అనుమతి ఇవ్వనందుకు నిరసన వ్యక్తం చేస్తూ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన ప్రదర్శన చేపట్టి, మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు సోమశేఖర్, ఉపేందర్, శ్రీనివాస్, రఘువరన్, శాంసన్ రాజ్, రొట్టెల సునీల్, మామిడి ప్రశాంత్, రాజీవ్, ఆదిత్య, సుచింద్ర పాల్గొన్నారు.

భూముల కబ్జాపై నజర్

జవహర్‌నగర్, జనవరి 6: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వదిలేదిలేదని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు సర్వే నంబర్లలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కాప్రా తాసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం కూల్చివేశారు. కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూములను పేపర్ లేఅవుట్ చేస్తూ అమాయక ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని, వారిపై ఇప్పటికే కేసులు న మోదు చేశామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'మిగిలిన సీట్లను భర్తీ చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ, పీజీ లా కళాశాలలో మిగిలిన ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం సీట్లను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య మాట్లాడుతూ.. ఎంతో మంది విద్యార్థులు లాసెట్ క్వాలిఫై అయినప్పటికీ, అధికారులు సీట్లు పూర్తిగా నింపకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలలో మిగిలిన చివరి సీటును కూడా నింపి, పేద విద్యార్థులకు భారం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, టీఐఎస్ఎఫ్ నాయకులు లెనిన్, విజయ్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

పోషకాహారం ప్రదర్శన

కంటోన్మెంట్ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మూడో వార్డు విమాన్‌నగర్ కాలనీలో ఉన్న మమత హైస్కూల్‌లో శనివారం పోషకాహారంపై ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో రాగిజావ, మొలకలు, క్యారెట్ హల్వా, డ్రైఫ్రూట్స్, సున్నుండలు, బెల్లం కోవాతో పాటు 120 రకాల పోషకాహార పదార్థాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు వాటి వినియోగంపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ

సీతాఫల్‌మండి డివిజన్‌లో ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలను డివిజన్ బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. మహంకాళి జిల్లా బజ్‌రంగ్ సేన అధ్యక్షుడు సతీశ్‌రాజ్ ఆధ్వర్యంలో శనివారం అక్షింతలను టీఆర్టీ క్వార్టర్స్‌లో ప్రతి ఇంటికీ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బజరంగ్ సేన ప్రధాన కార్యదర్శి సూర్య శుక్లా,నాయకులు అజయ్ నాయుడు, జగదీశ్ గౌడ్, ప్రసాద్, వేణు, మల్లికార్జున్, వెంకటేశ్, శరత్, అమర్ నాథ్ పాల్గొన్నారు. - సికింద్రాబాద్, జనవరి 6

మూఢ నమ్మకాలను అంతం చేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సునీలారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 6 : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉమెన్స్ టీచర్స్ ఫెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మెకస్టర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి అతిథులుగా శాస్త్రవేత్తలు డాక్టర్ సునీలారెడ్డి, డాక్టర్ ఆంజనేయులు, ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి హాజరయ్యారు. ఈ ఫెస్ట్‌లో భాగంగా సాంస్కృతిక, విజ్ఞాన ప్రదర్శనకు సంబంధించిన మ్యాజిక్ కార్యక్రమం, సైన్స్ టీచర్లకు పోటీలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను అంతం చేసేందుకు విజ్ఞాన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. ఈ బాధ్యత ఉపాధ్యాయులపై అధికంగా ఉంటుందన్నారు.

సంక్షేమ పథకాలు అందిస్తాం

మల్కాజిగిరి, జనవరి 6: ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం మచ్చ బొల్లారం డివిజన్ తోళ్ల కార్ఖాన సెంటర్ వద్ద ప్రజాపాలన దరఖాస్తులను మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ ప్రవీణ, కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు డాక్టరేట్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 6 : అరోరా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు కే చంద్రశేఖర్ జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. మండల పరిధిలోని కాచవానిసింగారం గ్రామానికి చెందిన కే చంద్రశేఖర్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల డీన్, కే వేణుగోపాలరావు మార్గదర్శకత్వంలో అన్ ఎనౌన్స్‌డ్ ఫ్రేంవర్క్ ఫర్ కార్డియాక్ డిసీజ్ క్లాసిఫికేషన్ యూజింగ్ ఫీచర్ రిడక్షన్ అండ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ అనే థీసీస్‌తో డేటా మైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పొందిన చంద్రశేఖర్‌ను కళాశాల యాజమాన్యం సన్మానించింది.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే వెంకటేశ్

అంబర్‌పేట / కాచిగూడ, జనవరి 6: అంబర్‌పేట ఛే నంబర్‌లో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం ఆయన ఆర్ అండ్ బీ ఈఈ ధర్మారెడ్డి, బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. గోల్నాక చర్చి నుంచి ముక్రం హోటల్ వరకు జరుగుతున్న నిర్మాణంలో ఎందుకు ఆలస్యమవుతుందని అధికారులను ఎమ్మెల్యే అడిగారు. ఇంకా పాత కట్టడాలను ఎందుకు క్లియర్ చేయలేదని అన్నారు. అక్విజేషన్ ఎప్పుడు చేస్తారని అడిగారు. వెంటనే నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. అలాగే ఖాద్రిబాగ్ వద్ద గల ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ ఎత్తును కూడా పెంచాలని చెప్పారు. శ్రీరమణ చౌరస్తాలో డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా అక్కడక్కడ మిగిలిపోయిన కట్టడాలను ముందుగా అక్విజేషన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సరిత, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామమందిరం అభివృద్ధికి కృషి

భగవంతుడిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడ మోతిమార్కెట్‌లోని క్వాలిటీగార్డెన్‌లో శ్రీరామమందిరం మొదటి వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం సుభాష్‌పటేల్ ఆధ్వర్యంలో అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠ పూజిత అక్షింతలను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామమందిరం అభివృద్ధికి బాధ్యతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్ర బిష్మాదేవ్, రాము, సంతోష్, సుభాష్, సుదర్శన్‌జీ, రవిశంకర్‌గౌడ్, పంకజ్, మల్లికార్జున్, అర్వింద్ పాల్గొన్నారు.